సాక్షి చిత్తూరు

శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



ఆశలు ఆవిరి!

ద్రవిడ వర్సిటీకి మళ్లీ 'బి' గ్రేడు రావడంపై ఉద్యోగులు, అధ్యాపకులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. - 8లో



ఏనుగుల బీభత్సం

వెలుతురుచేను పంచాయతీ శ్రీనివాసపురంలో పంట పొలాలను ఏనుగులు ధ్వంసం చేశాయి. - 8లో



సోకు కూటమిది!

పలమనేరు శివాలయానికి 5లక్షలు విరాళమిచ్చిన దాత, చైర్మన్‌కు ఆహ్వానం లేకుండానే కూటమి నేతలు మళ్లీ భూమి పూజ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

అరసవల్లికి ధర్మ ప్రచార రథం

కాణిపాకం : కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి క్షేత్రంలోని ధర్మప్రచార రథం శుక్రవారం శ్రీకాకుళం జిల్లా అరసవల్లికి బయలుదేరింది. అక్కడ వెలసిన సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈనెల 4వ తేదీన జరిగే రథ సప్తమి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించనున్నారు. అలాగే ప్రముఖ ఆలయాలకు ఈ ప్రచారం రథం వెళ్లనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు.

నేడు జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ : కలెక్టర్



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈనెల 1వ తేదీన సామాజిక పింఛన్లను పంపిణీ చేస్తారని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 1న జిల్లాలోని లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్‌లు పంపిణీ చేస్తారన్నారు. ఉదయం 6 గంటలకే పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియను ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లు పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో 2,66,491 మంది పింఛన్‌దారులకు రూ.113.20 కోట్లు ఫిబ్రవరి నెల పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి పొరబాట్లు తలెత్తకుండా పింఛన్లు పంపిణీ పారదర్శకంగా చేపట్టాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు.

నేడు 108 ఉద్యోగుల మహాసభ

చిత్తూరు రూరల్(కాణిపాకం) : చిత్తూరు నగరంలోని రెవెన్యూ ఎంప్లాయిస్ భవనంలో శనివారం 108 ఉద్యోగుల సంఘ మహాసభను నిర్వహిస్తున్నట్లు 108 జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సభ జరుగుతుందన్నారు. ఈ సభలో నూతన కమిటీని ఎన్నుకోనున్నామని, సభను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి రేషన్ పంపిణీ చేయనున్నట్లు డీఎస్ఓ శంకరన్ తెలిపారు. మొత్తం 1,339 చౌక దుకాణల పరిధిలోని 5,31,019 కార్డుదారులకు బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు అందించనున్నారన్నారు. ఇందుకు గాను ప్రభుత్వం జిల్లాకు 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యం, 3 వేల మెట్రిక్ టన్నుల చక్కెర, 5 టన్నుల కందిపప్పు అందించినట్లు పేర్కొన్నారు.

జిల్లా అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

పులిచెర్ల(కల్లూరు) : పులిచెర్ల మండలంలోని మంగళంపేట వద్ద ఉన్న భూములతో పాటు అటవీ ప్రాంత భూములను పెద్దిరెడ్డి కుటుంబికుల పేర కబ్జా చేసి అందులో రోడ్డు వేశారని మూడు రోజుల కిందట 'ఓ పత్రికలో కథనం ప్రచురితం అయింది. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని మంగళంపేట సమీప భూములను క్షేత్ర స్థాయిలో జిల్లా స్థాయి అధికారులు పరిశీలించారు. శుక్రవారం మధ్యాహ్నం అక్కడ వేసిన సిమెంట్ రోడ్డు పనులను 2.2 కిలోమీటర్లు పరిశీలించారు.ఆ సమయంలో ఇతరులను ఆ ప్రాంతంలోకి అనుమతించలేదు. మిగిలిన ఇతర పనులను పరిశీలిస్తామని అధికారుల చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఎఫ్ఓ భరణి, ఆర్డీఓ శ్రీనివాసులు, ఎఫ్ఆర్ఓ థామస్ సుకుమార్, జిల్లా సర్వేయర్ గిరి, తహసీల్దారు జయసింహ, ఎస్ఐ వెంకటేశ్వరులు పాల్గొన్నారు.

కుప్పం విద్యార్థి ప్రతిభ

– జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి



మొహాలీలో మొదటి బహుమతి అందుకుంటున్న శివశంకర్

కుప్పంరూరల్ : కుప్పం పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈ అభ్యసిస్తున్న శివశంకర్ జాతీయ స్థాయిలో మొదటి బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ జగన్నాథరావు తెలిపారు.76వ గణతంత్ర వేడుకల సందర్భంగా పంజాబ్ రాష్ట్రం మొహాలీ యూనివర్శిటీ, 'ప్లక్షా యూనివర్శిటీ' నిర్వహించిన 'యంగ్ క్రియేటర్స్ లీగ్'లో శివశంకర్ ప్రదర్శించిన 'ఇన్నోవేటివ్ వీల్‌చైర్ డిజయిన్డ్ ఫర్ లింబ్ ఇంపెయిర్డ్ యూజర్స్' శకటానికి జాతీయ స్థాయిలో మొదటి బహుమతి లభించింది. శుక్రవారం నిర్వహించిన ఫైనల్లో శివశంకర్ మొదటి బహుమతి సాధించి రూ.25 వేల నగదు పురస్కారం అందుకున్నట్లు ప్రిన్సిపల్ జగన్నాథరావు తెలిపారు. ఈ సందర్భంగా విజేతకు అధ్యాపకులు సుబ్బన్న, రమేష్, కృష్ణారావు, శ్రీనివాసులు అభినందనలు తెలిపారు.

పేదల బ్రాండ్లు కల్తీ!

ఎన్నికల ముందు నుంచి మద్యం ప్రియులనే టీడీపీ టార్గెట్ చేసింది. భారీగా ధరలు తగ్గిస్తామని ఊదరగొట్టింది. తీరా అధికారం చేపట్టాక కూటమి ప్రభుత్వం రూ.100కే మద్యం అంటూ జబ్బలు చరిచింది. ఏడాది కూడా గడవక ముందే కల్తీ మద్యానికి బాటలు వేసింది. ఇదే అదనుగా నకిలీ ముఠా రెచ్చిపోయింది. పేదల బ్రాండ్లుగా గుర్తింపు పొందిన రూ.100, రూ.130 మద్యాన్ని కల్తీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. తిరుపతి సమీపంలోని దామినేడులో పట్టుబడిన కల్తీ మద్యం ముఠాను చూస్తే ఇదే అర్థమవుతోంది. తాము సేవించే మద్యాన్ని కల్తీ చేస్తున్నారేమోనని మద్యం ప్రియుల్లో భయాందోళన మొదలైంది.



దామినేడులో పట్టుబడ్డ స్పిరిట్, నకిలీ మద్యం, స్టిక్కర్లు, లేబుళ్లు

- దామినేడులో భారీగా కల్తీ మద్యం స్వాధీనం
- రూ.100, రూ.130 మద్యం సీసాల్లో కల్తీ జరిగినట్టు అనుమానం!
- పేదల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం
- తక్కువ ధర అని చెప్పి కల్తీ మద్యాన్ని అంటగడుతున్నారా?
- విచ్చలవిడి మద్యం వెనుక అనుమానాలెన్నో?
- ముఠా గుట్టురట్టు కావడంతో మద్యం ప్రియులు షాక్

సాక్షి టాస్క్‌ఫోర్స్: కల్తీ మద్యం వెలుగు చూడడంతో మద్యం ప్రియులు షాక్‌కు గురయ్యారు. విచ్చలవిడి మద్యం వెనుక కల్తీ ఉందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ధర అని చెప్పి కల్తీ మద్యాన్ని అంటగడుతున్నారా..?అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి సమీపంలోని దామినేడు ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం కల్తీ మద్యం ముఠా గుట్టురట్టు కావడంతో భయంతో వణికిపోతున్నారు. దీని వెనుక ఎవరి హస్తం ఉందోనని..? పలువురు ఆరా తీసే పనిలో పడిపోయారు.

మద్యం దుకాణాల్లో కూడానా?

నకిలీ మద్యం కేవలం బెల్టు షాపులకే సరఫరా చేస్తున్నారా? లేక మద్యం దుకాణాలకూ పంపిణీ చేస్తున్నారా? అనేది తేలాల్సి ఉంది. పోటీపడి టెండర్లు దక్కించుకున్న కొందరు మద్యం వ్యాపారులు పెట్టిన పెట్టుబడి రాబట్టుకోవడానికి నకిలీ మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యాన్ని ఒకరిద్దరే కొనుగోలు చేస్తున్నారా? ఎక్కువ మంది తీసుకెళ్తున్నారా? అనేదానిపై విచారణ చేపట్టాల్సి ఉంది.

ఇంకా ఎక్కడెక్కడున్నాయో?

కూటమి ప్రభుత్వం వచ్చాకే ఈ నకిలీ మద్యం తయారీ ముఠా తెరపైకి వచ్చింది. అంతకుముందు ఇటువంటి ఘటనలు లేవని అధికారులు చెబుతున్నారు. ఈ నకిలీ ముఠా కేవలం దామినేడు వద్దే కాకుండా.. మరిన్ని చోట్ల తయారు చేస్తున్నట్టు ఎక్సైజ్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేవలం దామినేడు వద్దే భారీ ఎత్తున నకిలీ మద్యం దొరికితే.. మిగిలిన చోట్ల ఇంకెంత నకిలీ మద్యం లభ్యవుతుందోనని మద్యం ప్రియులు ఆందోళన చెందుతున్నారు.

నకిలీ మద్యం ఇస్తారా?

దామినేడు వద్ద దొరికిన నకిలీ మద్యం విషయం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దావాణంలో వ్యాపించింది. ఎన్నికలకు ముందు తక్కువ ధరకే నాణ్యమైన మద్యం సరపరా చేస్తామని హామీ ఇచ్చిన కూటమి పెద్దలు.. నకిలీ మద్యాన్ని తక్కువ ధరకు ఇచ్చి తమ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారా? అంటూ మద్యం ప్రియులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నకిలీ మద్యం తయారీ వెనుక ఎవరి ప్రమేయం ఉంది? ఇందుకు సహకరించిన వారెవరు? ఈ నకిలీ మద్యాన్ని ఎప్పటి నుంచి ఎక్కడెక్కడికి సరఫరా చేశారు? అనే విషయాలు వెల్లడించాలని మద్యం ప్రియాలు డిమాండ్ చేస్తున్నారు.

ఆ బ్రాండ్లే టార్గెట్

కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం ఏరులై పారిస్తోంది. ఎక్కడ చూసినా బెల్టుషాపులు, అనధికారిక దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తోంది. ఇందులో పేదలు అధికంగా సేవించే రూ.100, రూ.130 రకాల బ్రాండ్లు ఒకరోజు ఉన్న టేస్ట్ మరో రోజు లేదని మద్యం ప్రియులు చెబుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. శుక్రవారం దామినేడులో పట్టుబడిన కల్తీ మద్యంలో ఎక్కువగా పేదలు తాగే బ్రాండ్లే ఉండడం దీనికి మరింత బలం చేకూరుతోంది. స్వాధీనం చేసుకున్న లేబుళ్లన్నీ రాయల్ క్యాన్ విస్కీ, ట్రాపికానా బ్రాండీ, హనీబీ బ్రాండీ, కేరళ మాల్ట్ విస్కీ, మంజీరా, నైసీ హార్స్, సెలబ్రిటీ చాయిస్ కంపెనీలకు చెందినవే ఉండడం గమనార్హం.



బాటిళ్లలో నింపిన నకిలీ మద్యం



నకిలీ మద్యం బాటిళ్ల తయారీకి ఉపయోగించిన పరికరాలు

మార్కెట్‌లోకి నకిలీ మద్యం!

కూలీలు, పేదలు కొనుగోలు చేసే బ్రాండ్లే లక్ష్యంగా నకిలీ మద్యం తయారు చేసినట్టు తేటతెల్లమైంది. శుక్రవారం దామినేడులో 23 క్యాన్లలోని 805 లీటర్ల స్పిరిట్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటితో పాటు 6,600 ఖాళీ మద్యం సీసాలు, పెద్ద ఎత్తున నకిలీ లేబుళ్లు, ఖాళీ మద్యం సీసీ మూతలను స్వాధీనం చేసుకున్నారు. తక్కువ ధరకు లభ్యమయ్యే మద్యాన్నే పేదలు కొనుగోలు చేస్తుండడం గ్రహించి వాటి పేరుతో నకిలీ మద్యాన్ని తయారు చేసినట్టు తెలుస్తోంది.

బెల్టు దుకాణాలకు కల్తీ మద్యం!

కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం ప్రియులను లక్ష్యంగా చేసుకుని విచ్చలవిడిగా విక్రయాలు పెంచింది. తక్కువ ధరకే మద్యం అని చెప్పి చీప్ లిక్కర్‌ని విక్రయించడానికి శ్రీకారం చుట్టింది. విక్రయాలను భారీగా పెంచేందుకు బెల్టు దుకాణాలను తీసుకొచ్చింది. కూటమి నేతల కనుసన్నల్లో గ్రామ గ్రామాన, వీధి వీధిన ఈ బెల్టు దుకాణాలు వెలిశాయి. ఈ దుకాణాలు నిర్వహించే వారు పది రూపాయలు ఆదాయం కోసం ఏ బ్రాండ్ తక్కువ ధరకు వస్తే.. ఆ బ్రాండ్‌నే కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. బెల్టు దుకాణాలపై ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో వారికి అడ్డే లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో కల్తీ మద్యం ఎక్కువగా బెల్టు దుకాణాలకే చేరినట్టు తెలుస్తోంది.

పథకం ప్రకారం గోబెల్స్ ప్రచారం

- డైవర్సన్ పాలిటిక్స్‌లో చంద్రబాబు నాయుడు దిట్ట
- పెద్దిరెడ్డిపై ప్రభుత్వం కుట్ర
- హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- మండిపడిన విజయానందరెడ్డి



ఎంసీ విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: చంద్రబాబు పథకం ప్రకారం పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై గోబెల్స్ ప్రచారానికి తెరతీశారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటగా ఎల్లో మీడియాలో వార్తలు రాయించడం, వాటిపై టీడీపీ నాయకులు ప్రెస్‌మీట్లు పెట్టడం ఆనవాయితీగా మారిందన్నారు. దానిపై ఏదో తప్పు జరిగిందని ప్రభుత్వం విచారణ పేరిట హడావుడి చేయడం వంటివి పథకం ప్రకారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

పెద్దిరెడ్డిపై అటవీ భూముల కబ్జా కూడా ఆ కోవకు చెందిందే అని తెలిపారు. దానిపై ఆయన న్యాయ పోరాటం చేస్తామని ప్రకటించిన విషయం గుర్తుచేశారు. దశాబ్దాలుగా ఆ భూమిపై వారి కుటుంబానికి ఉన్న హక్కు, అది ఎలా సంక్రమించిందో వివరంగా మీడియా సమావేశంలో తెలియజేశారన్నారు. ఈ అంశం పై ఎలాంటి విచారణకైనా సిద్ధమని స్పష్టం చేశారన్నారు. గౌర్రెల మందలాగా టీడీపీ నాయకులు చెప్పిందే చెబుతున్నారని ఎద్దేవా చేశారు. హామీల అమలు చేతకాక ప్రతి నెలా ఏదో ఒక విషయంపై విపరీత ప్రచారం చేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. నాడు చంద్రబాబు డెయిరీ కోసం చిత్తూరు జిల్లాలోని పాడి రైతుల కల్పతరువు విజయా డెయిరీని పథకం ప్రకారం దివాలా తీయించారన్నారు. కానీ అదే ప్రాంతంలో అమూల్ లాంటి దిగ్గజ సంస్థను జగనన్న హయాంలో తీసుకొచ్చారని వివరించారు.

కువైట్‌లో ఉద్యోగం పేరిట మోసం

– స్వదేశానికి రప్పించాలని వేడుకోలు



యుగంధర్

నింద్ర : మండలంలోని శ్రీరామాపురం పంచాయతీ పెద్దపట్టెడకు చెందిన నరసింహులు కుమారుడు యుగంధర్‌కు కువైట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కువైట్‌కు పంపించి అక్కడ ఉద్యోగం చూపకుండా మోసానికి పాల్పడ్డాడు. యుగంధర్ కథనం మేరకు వివరాలు ఇలా.. తిరుపతి జిల్లాకు చెందిన విజయ్‌కుమార్ కువైట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి అయిదు నెలల కిందట తన వద్ద నుంచి రూ.2 లక్షల తీసుకొని కువైట్‌కు తీసుకెళ్లాడు. కానీ 5 నెలలుగా ఉద్యోగం కల్పించలేదు. ఈ విషయంపై విజయ్‌కుమార్‌ను అడుగుతుంటే ఇంకా కుదరలేదని బకాయిస్తున్నాడని సెల్ఫీ వీడియోలో వాపోయాడు. కువైట్‌లో ఉద్యోగం లేకపోవడంతో ఇంటి నుంచి పంపిస్తున్న డబ్బులతోనే కాలం గడుపుతున్నట్లు తెలిపారు. విజయ్ కుమార్ చేతిలో మోసపోయానని భారత ప్రభుత్వం కువైట్ నుంచి స్వదేశానికి రప్పించే ఏర్పాటు చేయాలని తన సెల్ఫీ వీడియో ద్వారా ప్రాధేయ పడుతున్నాడు.

రిజిస్ట్రేషన్ల బాదుడే.. బాదుడు

- ధరణి ధరల పెంపునకు సిద్ధం
- 10–20 శాతానికి పైగా పెంపు
- నేటి నుంచి కొత్త ధరలు



వినియోగదారులతో కిక్కిరిసిన అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచి బాదుడే.. బాదుడు అన్న చందంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నెత్తిన భారం మోపిన ప్రభుత్వం, నేడు భూముల ధరలు పెంచేందుకు రంగం సిద్ధం చేసింది. జనవరి1వ తేదీ నుంచే పెంచాలని భావించిన సర్కారు.. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో తాత్కాలికంగా వాయిదా వేసింది. తాజాగా నేటి నుంచి భూముల ధరలు పెరగనుండడంతో రిజిస్ట్రేషన్ ధరలు పెరగనున్నాయి.

సంక్షోభంలో రియల్ ఎస్టేట్ రంగం

ఈనెల1వ తేదీ నుంచి అమలు చేసేందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సిద్ధం చేసింది. జిల్లాలో మొత్తం 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ప్రతి రోజూ 200–300 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. సాధారణంగా బయట మార్కెట్‌లో అధిక ధరలకు కక్షిదారులు భూములుకొన్నా ఆ ధరలను పరిగణలోనికి తీసుకోకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలపై కక్షిదారులు ప్రభుత్వానికి చలనా రూపంలో ఫీజులు చెల్లించి రిజి స్ట్రేషన్లు చేయించుకుంటారు. ప్రభుత్వం భూముల ధరలు పెంచితే ఫీజులు తడిసి మోపెడవుతాయి. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం సంక్షోభంలో పడింది. ప్రస్తుతం భూముల ధరలు పెంచే యోచనతో మరింత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుందని నిపుణులు భావిస్తున్నారు. ధరలు పెరగనుండడంతో భూములు కొనాలనుకునేవారు వెనకడుగు వేస్తున్నారు. గ్రోత్ సెంటర్ల ఆధారంగానే రిజిస్ట్రేషన్ విలువలు పెంచాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. సగటున 15 నుంచి 20 శాతం వరకు పెంపుదల చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అందుకు అనుగుణంగా జిల్లాలో ధరలు పెంచేందుకు రంగం సిద్ధం చేశారు.

నేటి నుంచి అమలు

కమర్షియల్ ప్రాంతాల్లోని స్థలాలే కాకుండా నివాస స్థలాలపై సైతం భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. 10 నుంచి 20 శాతం పైగా పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చిత్తూరు నగరంలో అత్యధికంగా చదరపు గజం విలువ రూ. 46,910 ఉండగా వాటిని రూ.51,600కు పెంచాలని ప్రతిపాదించారు. అదే విధంగా అత్యధికంగా ఎకరా పొలం విలువ రూ.51.34 లక్షలు ఉండగా రూ.56.68 లక్షలకు పెంచనున్నారు. చిత్తూరు రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని యాదమరి, కాణిపాకం, జీడీనెల్లూరు తదితర ప్రాంతాల్లో చదరపు గజంను రూ.2200 నుంచి రూ.2500కు పెంచనున్నారు. పలమనేరులో రూ.16 వేల నుంచి రూ.18 వేలకు, పుంగనూరులో రూ.2000 నుంచి రూ.2300, కుప్పంలో రూ.14 వేల నుంచి రూ.16 వేలకు , కార్వేటినగరంలో రూ.11వేల నుంచి రూ.13 వేలకు, నగరిలో రూ.14 వేల నుంచి రూ.17 వేలకు చదరపు గజం ధరలు పెరగనున్నాయి. అదే విధంగా ఎకరా పొలం దిగుమాసపల్లె, గుడిపాల, యాదమరిలో రూ.20 లక్షల నుంచి రూ.23 లక్షలకు , పలమనేరు, నాగమంగళంలో రూ.12 లక్షల నుంచి రూ.14 లక్షలకు , కుప్పంలో రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షలు, పుంగనూరు, చౌడేపల్లె, రాగనిపల్లెలో రూ.13 లక్షల నుంచి రూ.16 లక్షలకు, కార్వేటినగరంలో రూ.11 లక్షల నుంచి రూ.13 లక్షలు, నగరిలో రూ.7.26 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెరగనున్నాయి.

కిటకిటలాడిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

చిత్తూరు కార్పొరేషన్ : శనివారం నుంచి భూ ధరలు పెరగనుండటంతో శుక్రవారం జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోలు, వినియోగదారులతో కిక్కిరిసింది. గురువారం సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో వినియోగదారులు రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్నారు. చిత్తూరు అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజు దాదాపు 20–30 రిజిస్ట్రేషన్లు అవుతుండగా, ప్రస్తుతం 50 అయ్యాయి. అలాగే రూరల్ కార్యాలయంలో 10–20 అవుతుండగా 30కి పైగా రిజిస్ట్రేషన్‌లు అయ్యాయి.

విధుల్లో బాధ్యతతో పనిచేయండి

– కలెక్టర్‌ను కలిసిన నూతన అధికారులు



కలెక్టర్ ను కలిసిన నూతన జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, డీఎస్పీ మహమ్మద్ అజీజ్

చిత్తూరు కలెక్టరేట్ : విధుల పట్ల బాధ్యతతో పనిచేసి ప్రజలకు మేలు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ నూతన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం పలు శాఖల నూతన అధికారులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయా శాఖల్లో బాధ్యతలు చేపట్టారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన చెన్నయ్య, నగరి డీఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ అజీజ్ కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం కాసేపు పలు అంశాలపై చర్చించారు.

వీధి బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో వీధి బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో వీధి బాలల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్ష శాఖ ఆధ్వర్యంలో వీధిబాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. వీధి బాలలను గుర్తించి వారిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమగ్రశిక్ష శాఖ పరిధిలో ఎన్‌జీఓల ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆవాస్ యోజన పథకంలో ప్రత్యేక వీధిబాలల వసతి గృహం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒకే పాఠశాల పరిధిలో బడిమానేసిన పిల్లలు 20 మంది ఉంటే వారికి ప్రత్యేక విద్యా వాలంటీర్‌తో శిక్షణ ఇప్పిస్తామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి భారతి మాట్లాడుతూ.. బాలల హక్కులను సంరక్షించాలన్నారు. తెలిసీ తెలియని వయస్సులో ఇళ్ల నుంచి వెళ్లిపోయి వీధి బాలలుగా మారి బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. కార్మిక శాఖ, పోలీసులు, చైల్డ్ వెల్ఫేర్ సంస్థ అధికారుల బృందాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరీ మాట్లాడుతూ.. వీధి బాలలను గుర్తించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దే చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ విజయశేఖరరాజు, ఎస్ఐ నాగ సౌజన్య, జిల్లా బాలల సంరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, డీవైఈవో చంద్రశేఖర్, సెక్టోరల్ అధికారులు నరోత్తమ రెడ్డి, ఉదయలక్ష్మి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

3న ఉద్యోగమేళా

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. శ్రీసిటీ నుంచి డైకిన్, అడేలా ఎలక్ట్రికల్ ప్రైవేట్ లిమిటెడ్, చెన్నై నందుగల కాల్‌మెన్ సర్వీస్ కంపెనీ ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొంటారన్నారు. ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్ గానీ, ఫెయిల్ గానీ అయిన విద్యార్థులు హాజరుకావచ్చన్నారు. 18– 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు హాజరు కావచ్చని తెలిపారు. ఈ ఉద్యోగ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలు కోసం 95731 04593 నంబరు సంప్రదించాలన్నారు.

ఎరువుల విక్రయ దస్త్రాలు గల్లంతు

– ఎరువుల అమ్మకం నిలుపుదలకు ఆదేశం



రికార్డులు చూపని ఎరువులు పరిశీలిస్తున్న ఏడీఏ శివకుమార్

ఐరాల : మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఎరువులకు సంబంధించిన సరైన రికార్డులు చూపకపోవడంతో 12.350 ఎంటీఎస్ ఎరువులు అమ్మకం నిలుపుదల చేస్తు పుంగనూరు ఏడీఏ శివకుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక సింగిల్ విండోను ఏడీఏ, ఏఓ వరలక్ష్మి, తవణంపల్లె ఎంఏఓ ప్రవీణ్‌తో కలిసి సింగిల్ విండో కార్యాలయంలో ఎరువుల రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీలో ఎరువులకు సంబంధించిన కొన్ని రికార్డులను సిబ్బంది చూపకపోవడంతో రూ.1,58,100 విలువ చేసే ఎరువుల విక్రయం నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. డీలర్లు ప్రతి రోజూ స్టాక్, ఎంఆర్‌పీ సూచించే బోర్డులు దుకాణాల వద్ద ప్రదర్శించాలని సూచించారు. అధిక ధరలకు ఎరువుల విక్రయించరాదని సూచించారు. డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

జైన్ సీఈఓ ఆకస్మిక మృతి


షమీర్ శర్మ (ఫైల్)

గంగాధర నెల్లూరు : గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని జైన్ కర్మాగారం సీఈఓ సమీర్ శర్మ (56) శుక్రవారం ఆకస్మిక మృతి చెందారు. గుండెపోటు రావడంతో చిత్తూరులోని తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. తన నివాసానికి సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమీర్ శర్మ జైన్ ఫ్యాక్టరీలో సుమారు 25 ఏళ్లుగా సీఈఓగా ఉండి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతుల మన్ననలు పొందారని ఆయన ఇక లేరని తెలుసుకున్న మామిడి రైతులు దిగ్భ్రాంతి చెందారు. షమీర్ మృతదేహానికి కలెక్టర్ సుమిత్ కుమార్, ప్రముఖులు, కర్మాగారం సిబ్బంది నివాళులర్పించారు.

సమీర్‌శర్మ మృతి తీరని లోటు


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

చిత్తూరు రూరల్(కాణిపాకం) : జైన్ మామిడి పండ్ల పరిశ్రమ సీఈఓ సమీర్ శర్మ మృతి పండ్ల పరిశ్రమకు తీరని లోటు అని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని మామిడి భవన్‌లో శుక్రవారం సమీర్ శర్మకు సంతాపం వ్యక్తం చేశారు. శర్మ హఠాన్మరణం బాధాకరమని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్, పరిశ్రమల సమాఖ్య నాయకులు, అధికారులు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పండ్ల పరిశ్రమల సమాఖ్య నాయకులు గోవర్ధన్‌బాబి, తలపుల పల్లి బాబురెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, తులసిరెడ్డి, ఉమాపతి, రమణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారి శివకుమార్ తదితరులు ఉన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి


మాట్లాడుతున్న షణ్ముగం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : బడ్జెట్ కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని దక్షిణాద్రి రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘం ఇన్‌చార్జ్ షణ్ముగం పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని బీసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు జరగాలన్నారు. అన్నింటా 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఈనెల 6,7 తేదీల్లో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని బీసీలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇక బీసీ కార్పొరేషన్‌కు రుణ దరఖాస్తులకు పెట్టిన గడువు సమయాన్ని పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం రజక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా మోహన్, ప్రధాన కార్యదర్శిగా నవీన్‌కుమార్‌లను నియమించారు. కార్యక్రమంలో నాయకులు రవిరాజు, వెంకటేష్, రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్రవిడ వర్సిటీపై ఆశలు ఆవిరి!



ద్రావిడ వర్సిటీ అధికారులు, ఉద్యోగులు 'ఎ' గ్రేడు కోసం చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం నేపథ్యంలో కచ్చితంగా వర్సిటీకి 'ఎ' గ్రేడు లభిస్తుందని ఆశించారు. కానీ వారి ఆశలపై న్యాక్ అధికారుల బృందం నీళ్లు చల్లింది. ప్రస్తుతం ఉన్న 'బి' గ్రేడునే మళ్లీ ప్రకటించింది. దీంతో ఉద్యోగులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఈ ప్రభావం డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌పై పడడంతో పునఃప్రారంభం చేయాలనుకున్న అధికారులకు ఈ విషయం మింగుడు పడటం లేదు.ఫలితంగా వర్సిటీ అభివృద్ధి మేడిపండు చందంగా మారింది.

- మళ్లీ న్యాక్ 'బి' గ్రేడుకే పరిమితం
- నిరుత్సాహంలో ఉద్యోగులు
- ఫలించని ప్రయత్నాలు

కుప్పం : ద్రావిడ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు దక్షిణ భారతదేశ రాష్ట్రాలన్నింటికీ కలిపి కుప్పంలో ఎంతో ఉన్నతాశయంతో 'ద్రావిడ విశ్వవిద్యాలయం' ఏర్పాటు చేశారు. అయితే వర్సిటీలో జనవరి 22వ తేదీ నుంచి 24 వరకు ఆచార్య ప్రేమందు మాథూర్ అధ్యక్షతన ఏడుగురు న్యాక్ పీర్ టీమ్ బృందం మూడు రోజుల పాటు విస్తృతంగా పర్యటించి వర్సిటీకి నూతన న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్) గ్రేడింగు కోసం నివేదికను న్యాక్ కేంద్ర కార్యాలయానికి సమర్పించారు. వర్సిటీ ఎంతో ఆశగా 'ఎ' గ్రేడు కోసం ఎదురుచూస్తున్న తరుణంలో శుక్రవారం న్యాక్ బెంగళూరు కార్యాలయం 2.45 పాయింట్లతో 'బి' గ్రేడును ప్రకటించింది. దీంతో వర్సిటీ అభివృద్ధి మళ్లీ అటకెక్కనుంది.

వర్సిటీకి ఇచ్చే నిధులతో రెగ్యులర్ బోధన, బోధనేతర సిబ్బందికే నిధులు చాలక ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్సిటీలో విధులు నిర్వహిస్తున్న 237 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటనలో వర్సిటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలల జీతాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 6 నెలలకు పైగా జీతాలు రాలేదు. ఇక రావడం కూడా కష్టంగానే ఉందని ఉద్యోగులు వాపోతున్నారు.

లోపం ఎక్కడ ?

వర్సిటీకి మంచి గ్రేడింగు కోసం అధికారులు దృష్టి పెట్టలేదన్న విమర్శలు ఉన్నాయి. గతంలో వర్సిటీ 'బి' గ్రేడును సాధిస్తే మళ్లీ వర్సిటీకి అదే గ్రేడును ప్రకటించడంతో ఉద్యోగులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఇక్కడ అధ్యాపకుల మధ్య రాజకీయ పోరు తప్ప అందరూ కలిసి వర్సిటీ అభివృద్ధికి పాటు పడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధ్యాపక బృందం రెండుగా విడిపోయి ఆధిపత్యం ప్రదర్శిస్తూ వర్సిటీని గాలికొదిలేస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

పలు విభాగాల్లో సున్నా విద్యార్థులు

వర్సిటీలోని పలు విభాగాల్లో విద్యార్థులు చేరలేదు. మరికొన్ని విభాగాల్లో సింగిల్ డిజిట్ విద్యార్థులతో కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఫోక్‌లోర్ విభాగం, తుళు విభాగం, సీడీఎల్‌పీ విభాగం, లింగ్విస్టిక్స్ వంటి విభాగాల్లో యూజీ, పీజీ విద్యార్థులు లేకుండా కొనసాగిస్తున్నారు. అదేవిధంగా తెలుగు, ఆంగ్లం వంటి పలు శాఖల్లో సైతం సింగిల్ డిజిట్ విద్యార్థులే అడ్మిషన్లు పొందారు. వర్సిటీ 1000 ఎకరాలపై పైగా 67 విశాలమైన భవనాలు ఉన్నా ఆశించిన స్థాయిలో విద్యార్థులు లేరు.

డిస్టెన్స్ ఎడ్యుకేషన్ గల్లంతు

గతంలో న్యాక్ 'బి' గ్రేడు రావడంతో వర్సిటీలోని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ మూత పడింది. అయితే ఈ సారి వర్సిటీకి ఎట్టి పరిస్థితుల్లోను న్యాక్ 'ఎ' గ్రేడును సాధించి డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌ను మళ్లీ ప్రారంభించాలన్న వర్సిటీ అధికారుల కల కలగానే మిగిలింది. వర్సిటీకి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనులతో పాటు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించవచ్చన్న ఆశలు అడియాశలయ్యాయి. న్యాక్ నూతన గ్రేడింగుతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా మారనుంది. ఏది ఏమైనా వర్సిటీ అధ్యాపకులు వర్సిటీ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేస్తే రాబోయే రోజుల్లో వర్సిటీ అభివృద్ధి చెందుతున్న అభిప్రాయం అందరిలో వ్యక్తమవుతోంది.

ఇసుక ట్రాక్టర్లు సీజ్


సీజ్ చేసిన ట్రాక్టర్లు

నగరి : కుశస్థలి నదిలో శ్మశానం వద్ద బ్రిడ్జికు, నివాసాలకు దగ్గరగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను శుక్రవారం సీఐ మహేశ్వర్ సీజ్ చేశారు. కేవీపీఆర్ పేట ఏకాంబర కుప్పం గ్రామ ప్రజల ఫిర్యాదు మేరకు ఆకస్మిక దాడి చేసిన పోలీసులు ఇసుకతో పాటు ట్రాక్టర్లు పట్టుకున్నట్లు తెలిపారు. సీజ్ చేసి వాటిని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించగా రికార్డులను తనిఖీ చేసి వారికి ఒక్కొక్క ట్రాక్టర్‌కి రూ.5000 నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధించామన్నారు. ఇసుక అవసరాలకు ఉచితంగా వాడుకోమని ప్రభుత్వం సూచిస్తుంటే దాన్ని ఆసరాగా తీసుకొని కొందరు అక్రమ మార్గాల్లో డబ్బులు సంపాదించాలని డంప్ చేసి ఎక్కువ మొత్తానికి తమిళనాడుకు తరలించడం చేస్తున్నారన్నారని సీఐ తెలియజేశారు. గతంలో తమిళనాడుకు అక్రమంగా రవాణా చేసే వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఎక్కడ ఇసుక తరలింపు జరిగినా సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఫోర్జరీ గుట్టు వీడేనా!

- కొనసాగుతున్న పోలీసుల విచారణ
- మరో తహసీల్దార్ సంతకం ఫోర్జరీ ఆరోపణలు
- ఫోర్జరీ వెనుకున్న ముఠా చిక్కేనా!



సాక్షి టాస్క్‌ఫోర్స్ : వాళ్లేమీ ఉన్నత విద్యావంతులు కాదు.. గ్రూప్స్‌కు ప్రిపేర్ అయిన నిరుద్యోగులు కాదు.. అంతకన్నా ముందు అసలు ఉద్యోగులే కాదు. చదివింది.. అరకొర చదువైనా సంతకాలను సేమ్ టూ సేమ్‌గా ఫోర్జరీ చేయడంలో సిద్ధహస్తులు. ఇలా ఏకంగా ఇద్దరు సంతకాలు ఫోర్జరీ చేసి వందల నకిలీ పట్టాలు, రిజిస్ట్రేషన్ తయారు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఫోర్జరీ వ్యవహారం ప్రస్తుతం చిత్తూరులో కలకలం రేపుతోంది. అయితే ఆ గుట్టు మిస్టరీగానే మిగిలింది.

చిత్తూరు అర్బన్ తహసీల్దార్‌గా ఇటీవల పనిచేసిన కళావతి సంతకం ఫోర్జరీ విషయం తెలిసిందే. దీనిపై 'సాక్షి' దినపత్రికలో 'ఆగని ఫోర్జరీ ధందా' పేరుతో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆమె ఫోర్జరీ విషయాలను తెలుసుకుని ఆ తప్పుడు ఎంజాయిమెంట్ సర్టిఫికెట్‌ను సబ్‌రిజిస్ట్రార్ ద్వారా సేకరించి చిత్తూరు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. 14 రోజులకు కిందట అందిన ఫిర్యాదుతో పోలీసుల విచారణ కొనసాగుతోంది. తొలుత తమిళనాడులోని వేలూరులో రబ్బర్ స్టాంప్, సీలు తయారు చేసే ప్రాంతానికి వెళ్లి విచారణ చేశారు. ఈ క్రమంలో ముగ్గురు వీఆర్ఏలు, ప్రముఖ ఫైనాన్స్‌లో పని చేస్తున్న ఇద్దరు సిబ్బందిని విచారించారు. తర్వాత తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు సక్రమంగా లేదని మరో మారు ఫిర్యాదు తీసుకున్నారు. మళ్లీ ఆ ఫిర్యాదుతో రిజిస్ట్రార్ ఆఫీసులో విచారణ చేశారు. గత తహసీల్దార్‌ను కూడా విచారించారు. అయితే ఈ విచారణ గోప్యంగా నడుస్తున్నట్లు తెలుస్తోంది.. దీనిపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి.

అనుమానాలు ఇలా...

ఫైనాన్స్ సిబ్బంది ఐడియానే ఇప్పుడు పలువురిని ఇరకాటంలో పెట్టిందా..? అతడి సహకారంతో వీఆర్‌ఏలు తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేశారా..? లేకుంటే ఈ వీఆర్‌ఏలకు ఇదే పనేనా నంటూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి? ఇంతకీ వీళ్లు ఫోర్జరీ చేసేందుకు డబ్బులు ఎంత తీసుకున్నారు? ఎంత మంది చేసుంటారు..? అనే అనుమానాలు కార్యాలయ అధికారులు, సిబ్బందిలో వ్యక్తమవుతున్నాయి. పదో తరగతి చదివినా ఈ వ్యక్తులు ఫోర్జరీ ఎలా చేశారని, వీరి వెనుక ఎవరెవ్వరూ ఉన్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మండల మేజిస్ట్రేట్ సంతకాన్నే ఫోర్జరీ చేస్తే ఇంత వరకు ఆ చేసిన వ్యక్తులను బహిర్గతం చేయకపోవడం ఏమిటని పలువురు విమర్శలు చేస్తున్నారు. గంగాధర నెల్లూరులో సర్వేయర్ సంతకం ఫోర్జరీ చేస్తే వెంటనే కేసు నమోదు చేసి అందుకు పాల్పడ్డ వ్యక్తులను బయటపెట్టారని అంటున్నారు. అయితే చిత్తూరు అర్బన్ తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసిన వ్యక్తులను బయట పెట్టకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక టీడీపీ నేతల జోక్యం చేసుకోవడంతో ఫోర్జరీకి పాల్పడ్డ వ్యక్తులను తప్పించే ప్రయత్నం జరిగిందనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

తుమ్మింద పాఠశాలలో టీవీల చోరీ


టీచర్లను విచారిస్తున్న పోలీసులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం రాత్రి మూడు టీవీలు చోరీ అయ్యాయి. వివరాలు ఇలా..స్వీపర్ బడిని శుభ్రం చేయడానికి రాగా తాళాలు పగలగొట్టిన విషయాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూస్తే టీవీలు లేకపోవడంతో వెంటనే హెచ్‌ఎం లలితాకు సమాచారం అందించారు. 55 ఇంచెస్ రెండు టీవీలు, 32 ఇంచెస్ టీవీ ఒకటి చోరీకి గురైనట్లు తెలుసుకున్న ఆమె తాలూకా పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు వారు అక్కడికి చేరుకుని చోరీ విషయాలపై ఆరా తీశారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు


రాధమ్మ


నదుం : మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్ షావలి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..గొంగివారిపల్లెకు చెందిన సహదేవయ్య భార్య ఎర్రమ్మ (65) జనవరి 26న పనుల నిమిత్తం ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి, తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబికులు తెలిసిన చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. ఈనేపథ్యంలో ఆమె కుమార్తె రాధమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

సొమ్ము వైఎస్సార్ సీపీది..సోకు కూటమిది!

- శివాలయ గాలి గోపురానికి ఎమ్మెల్యే భూమి పూజ
- గత ప్రభుత్వ పాలనలో మంజూరైన రూ.1.28 కోట్లు
- అప్పట్లో సీజీఎఫ్ ద్వారా మంజూరు చేయించిన అప్పటి ఎమ్మెల్యే వెంకటేగౌడ
- ఇప్పుడు పనులను ప్రారంభించిన ప్రస్తుత ఎమ్మెల్యే
- ఆలయాభివృద్ధికి విరాళమిచ్చిన ఆలయ చైర్మన్‌కు ఆహ్వానం నిల్!


నూతన గాలిగోపుర నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

పలమనేరు: పట్టణంలోని శివాలయంలో నూతన గాలి గోపుర నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి శుక్రవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. స్థానిక దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇలా ఉండగా ఇక్కడి ఆలయంలో గాలి గోపుర నిర్మాణం కోసం అప్పటి శివాలయ చైర్మన్ వీరభద్ర వినతి మేరకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తమ ప్రభుత్వ హయాంలో కామన్ గుడ్ ఫండ్స్(సీజీఎఫ్) ద్వారా రూ.1.28 కోట్లను మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించి కాంట్రిబ్యూషనరీ మొత్తం రూ. 25లక్షలు కట్టాల్సి ఉండగా శివాలయానికి సంబంధించి ఎండోమెంట్ వద్దనున్న రూ.20 లక్షలతోపాటు ఆలయ చైర్మన్ వీరభద్ర రూ.5 లక్షలు విరాళమిచ్చారు. దీంతో అప్పట్లోనే గాలిగోపురానికి నిధులు మంజూరయ్యాయి. ఆపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో స్థానిక ఎండోమెంట్ అధికారులు ఇక్కడి భూమిపూజను స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా నిర్వహించారు. శృంగేరి పీఠం వేదపండితులు శ్రీచక్రం, అష్ట దిగ్బంధ భూమి పూజలు చేశారు. ఇక, ఆలయాభివృద్ధి కోసం నాడు పాటుపడిన దాతలను స్థానిక ఆలయ ఈఓ కమలాకర్ ఆహ్వానించకపోవడంపై విమర్శలొస్తున్నాయి. దాత వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడు కావడంతో కూటమి నేతలకు భయపడి ఈవో దాతలను పిలవలేదని చర్చకు తావిచ్చింది.



దాత, చైర్మన్ వీరభద్ర ఇచ్చిన రూ. 5 లక్షల విరాళం తాలూకు బ్యాంకు రశీదు(ఫైల్)

మహిళ మెడలో నగల అపహరణ


చిట్టెమ్మ, బాధితురాలు

వెదురుకుప్పం : ద్విచక్రవాహనంలో వస్తున్న దంపతులను గుర్తు తెలియని వ్యక్తులు అటకాయించి మహిళ మెడలోని తాళిబొట్టుతో సహా బంగారు నగలను అపహరించుకుపోయారు. పెనుగులాటలో మహిళకు గాయాలయ్యాయి. వెదురుకుప్పం మండలంలోని ఎర్రగుంటపల్లె సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుల కథనం మేరకు... మండలంలోని మాంబేడు పంచాయతీ కసవనూరు గ్రామానికి చెందిన దంపతులు చిట్టెమ్మ, రామచంద్రారెడ్డి ఇద్దరూ మూడు రోజుల కిందట ద్విచక్ర వాహనంలో తిరుపతికి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని ఇంటికి బయలు దేరారు. అయితే ఎర్రగుంట సమీపంలోని కనుమ వద్ద గుంతల రోడ్డు కావడంతో చిట్టెమ్మ భర్త రామచంద్రారెడ్డి బైక్‌ను నెమ్మదిగా నడపడంతో వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని వెంబడించారు. వాహనంపై ఉన్న చిట్టెమ్మ మెడలో ఉన్న బంగారు తాళిబొట్టును లాక్కునే ప్రయత్నంలో చిట్టెమ్మ కింద పడిపోయింది. దీంతో తాళిబొట్టుతో పాటు నగలను లాక్కెళ్లారు. ఈ ప్రయత్నంలో చిట్టెమ్మ గుర్తు తెలియని వ్యక్తులతో పెనుగులాడడంతో గాయపడి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సుమారు 10 సవరాల బంగారు నగలు అపహరించుకుపోయినట్లు బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయమై అప్పుడే వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పెద్దిరెడ్డిపై ప్రభుత్వం కక్ష సాధింపు – జెడ్పీ చైర్మెన్


శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

వి.కోట : పులిచెర్ల మండలంలో అటవీ భూములను కబ్జా చేశారని కూటమి ప్రభుత్వం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అవాస్తవాలు ప్రచారం చేయడం సరికాదని, నిజాలుంటే నిరూపించాలని జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు మండిపడ్డారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగానే మాజీ మంత్రిపై కుట్రలకు పాల్పడుతోందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే 1981లో ఆ భూములపై కమిటీ ఏర్పాటు చేసి పరిశీలించగా ఆ భూములు ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించినవని నిర్ధారించారన్నారు. అయితే ఆ భూములకు సంబంధించి గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడూ చంద్రబాబు నాయుడు కమిటీలను ఏర్పాటు చేసి రెవెన్యూ, అటవీ అధికారులతో సర్వే చేయించగా అవి ప్రభుత్వ భూములు కాదని నిర్ధారించిన మాట వాస్తవం కాదా ? అని ప్రశ్నించారు..? ఎలాగైనా మాజీ మంత్రిపై కుట్రలు పన్ని ప్రజల దృష్టిలో దోషిగా నిలపాలని చేస్తున్న చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు సరైన బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు.

మాజీ మంత్రిపై గోబెల్స్ ప్రచారం

పలమనేరు : రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై కూటమి నేతలు, పచ్చ మీడియా చేస్తున్న గోబెల్స్ ప్రచారాలను జనం నమ్మరని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా జనం దృష్టిని మళ్లించేందుకు చంద్రబాబు ఆడుతున్న డైవర్షన్ పాలిటిక్స్‌ను జనం ఇప్పటికే బాగా గమనిస్తున్నారన్నారు. తిరుమల లడ్డూ నుంచి ఇప్పుడు పెద్దిరెడ్డిపైకి జరిగిన ఆరోపణలు కేవలం ప్రజలను ఏమార్చేందుకేనన్నారు. ఈ దఫా ఎన్నికల్లో జనమే చంద్రబాబుపై ప్రత్యక్ష యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ విషయం ఇప్పటికైనా తెలుసుకుంటే బాగుంటుందని మండిపడ్డారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- ముగ్గురికి గాయాలు
- ప్రమాదానికి కారణమైన గేర్‌లెస్ కారు నడిపిన పెరాలసిస్ రోగి


ప్రమాదానికి కారణమైన కారు

పలమనేరు : పట్టణ సమీపంలోని రాయలసీమ హోటల్ వద్ద చైన్నై– బెంగళూరు జాతీయ రహదారిపై రోడ్డు క్రాస్ చేస్తున్న బైక్‌ను వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బైరెడ్డిపల్లి మండలం ఎర్రకదిరేపల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, ఆయన భార్య రత్నమ్మ, మనవడు కలిసి పలమనేరుకు వస్తూ రోడ్డుపై క్రాస్ చేస్తుండగా వేగంగా పలమనేరు వైపు వస్తున్న కారు వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో రత్నమ్మ తలకు తీవ్ర గాయం కాగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని స్థానికుల సమాచారంతో 108 వాహనంలో పలమనేరు ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారమైన కారు డ్రైవర్ పుంగనూరుకు చెందిన వ్యక్తి విరుపాక్ష్యపురం నుంచి లో నాటుమందు తీసుకొని వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా డ్రైవర్ సైతం కాలు కదపలేని పెరాలసిస్ రోగి కావడం గమనార్హం. ఆయన గేర్‌లెస్ కారును నడుపుకుంటూ వచ్చి ఈ ప్రమాదానికి కారకుడు కావడం కొసమెరుపు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

పంచాయతీలు ఆదాయాన్ని పెంచుకోవాలి


చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ పార్వతి

ఐరాల : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా ఆయా గ్రామాల్లోని పంచాయతీలు ఆదాయాన్ని పెంపొందించుకోవాలని డీఎల్‌పీఓ పార్వతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాతపాళ్యం, నాగంవాండ్లపల్లె, మొరంపల్లె, 35 యర్లంపల్లెలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం చెత్త సంపద తయారీ కేంద్రాలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని చెత్తను సేకరించి ఎరువులు తయారు చేసి సంపద సృష్టించాలని తెలిపారు. దీనిపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో గ్రామాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనలక్ష్మి, ఈఓపీఆర్డీ కుసుమకుమారి, ఏపీఎం నాగరత్న, పంచాయతీ కార్యదర్శులు మాధవి, మునీశ్వరి, తులసిరామ్, ఇందిరా, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల బీభత్సం

– మామిడి, కొబ్బరి, వరి పంటల ధ్వంసం


వరి పంటను తొక్కేసిన ఏనుగులు

బంగారుపాళెం : మండలంలోని వెలుతురుచేను పంచాయతీ శ్రీనివాసపురంలో గురువారం రాత్రి పంటలపై ఏనుగులు దాడి చేసి ధ్వంసం చేశాయని రైతులు వాపోయారు. సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు రైతుల పొలాలపైకి వచ్చాయన్నారు. గ్రామానికి చెందిన రైతులు సుబ్రమణ్యం, రామయ్య, సుగుణ, తంగవేల్ సంబంధించిన మామిడి, కొబ్బరి చెట్లను విరిచేశాయన్నారు. అదే విధంగా వరి పంటను తొక్కేశాయని వాపోయారు. నెల రోజులుగా బోడబండ్ల సమీపంలోని పాతూరుబండ అటవీ ప్రాంతంలో 15 ఏనుగులు మకాం వేశాయన్నారు. రాత్రి సమయంలో ఏనుగులు పంటలపై వరుస దాడులు చేస్తూ తీవ్రంగా నష్టాన్ని కలిగిస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు చేతి కందే సమయంలో ఏనుగులు పంటలపై దాడి చేసి నష్టం కలిగిస్తుండటంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట పొలాలపైకి ఏనుగులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.